వానలు.. పొంగుతున్న వాగులు


కేసముద్రం: సంతోష్‌నగర్ కాలనీలో చేరిన వరద నీరు


తొర్రూరు రూరల్: మత్తడి పోస్తున్న అమ్మాపురం చెరువు..


కొత్తగూడ: నీట మునిగిన పంట పొలాలు


తొర్రూరు రూరల్: కంఠాయపాలెం వాగును పరిశీలిస్తున్న పోలీసులు


పెద్దవంగర: గంట్లకుంట పరిధిలో నేలకూలిన విద్యుత్ స్తంభం


కేసముద్రం: అర్పనపల్లి వట్టివాగు ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ దామోదర్


తొర్రూరు రూరల్: ఆలయంలోకి చేరిన వరదనీరు


దంతాలపల్లి: పెద్దముప్పారంలో పాలేరు వాగు



డోర్నకల్: వరద నీటిలోంచి వెళ్తున్న బస్సు


గూడూరులో పాకాలవాగు ఉధృతి

గూడూరు: మండల కేంద్రం సమీప నెక్కొండ, కేసముద్రం రహదారిలోని పాకాలవాగు శనివారం ఉదయం నుంచి ఎడతెరిపికుండా కురుస్తున్న వర్షానికి ఉధృతి పెరిగింది. ఎస్సై బి.గిరిధర్‌రెడ్డి నీటి వద్దకు రాకుండా చర్యలు తీసుకున్నారు.

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని తుమ్మిడి చెరువు అలుగు పోస్తుంది. దీంతో తుమ్మిడి చెరువు, ముత్యాలమ్మ కుంట దిగువన ఉన్న పంట పొలాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మహబూబాబాద్: జిల్లా కేంద్రం శివారులోని మున్నేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మున్నేరు వాగు వద్దకు వెళ్లకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

దంతాలపల్లి: దంతాలపల్లి–సూర్యాపేట ప్రధాన రహదారిపై చెట్టు విరిగి అడ్డంగా పడిపోయింది. ఎస్సై రాజు తమ సిబ్బందితో కలిసి చెట్టును తొలగించారు. పెద్దముప్పారం గ్రామ సమీపాన ఉన్న పాలేరు వాగు బ్రిడ్జిపై నుంచి ప్రవహించడంతో రాకపోకలు నిలిపేశారు.

గార్ల: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గార్ల సమీపంలోని పాకాల ఏరు శనివారం చెక్‌డ్యాం పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గార్ల నుండి రాంపురం, మద్దివంచ పంచాయతీల గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

కురవి: ఉమ్మడి కురవి మండలంలో శనివారం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చెరువులు, కుంటలకు వరద నీరు వచ్చి చేరుతుంది. కురవి మండల కేంద్రంలో రోడ్లు జలమయమయ్యాయి.

రాకపోకలకు అంతరాయం

తొర్రూరు రూరల్: మండలంలోని కంఠాయపాలెం, గుర్తూరు, వెంకటాపురం గ్రామాలకు వెళ్లే వాగులు పొంగిపొర్లడంతో రాకపోకలకు అంతరాయాలు ఏర్పడ్డాయి. రోడ్లన్నీ జలమయమై, ఇళ్లు, దేవాలయాలు సైతం వరదనీటిలో మునిగిపోయాయి.

కొత్తగూడ: మండలంలో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. వాగుల సమీపంలోని పంట పొలాలు నీట మునిగాయి. తున్న వాగులు దాటేందుకు ప్రయత్నం చేసి ప్రమాదాలు కొనితెచ్చుకోవద్దని ఎస్సై కుశకుమార్ హెచ్చరించారు.

కేసముద్రం: సముద్రంస్టేషన్‌లో అండర్ డ్రెయినేజీ ద్వారా వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో, రైల్వేట్రాక్‌కు ఇరువైపుల నుంచి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. అర్పనపల్లి వట్టివాగు వంతెనకు సమీపంలోకి ఉధృతంగా ప్రవహించింది. తహసీల్దార్ దామోదర్ వట్టివాగు వంతెనను పరిశీలించి, ముందస్తు జాగ్రత్తలను ఏర్పాటు చేయించారు.

డోర్నకల్: డోర్నకల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఓపెన్ జిమ్‌తో పాటు పాఠశాల ఆవరణ జలమయమైంది. సాయినగర్‌లో వరదనీటిలో ప్లాస్టిక్ వ్యర్థాలు కొట్టుకురావడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

పెద్దవంగర: మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలకు నీరు చేరింది. మండలంలోని గంట్లకుంటలో ఐదు, పోచంపల్లి ఒక విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మరమ్మతులు చేపట్టినట్లు ఏఈ రమేష్‌బాబు తెలిపారు.

రోడ్లు జలమయం

నెల్లికుదురు: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కారణంగా శనివారం రాత్రి వరదనీరు పెరిగి రోడ్లను బ్లాక్ చేస్తున్నాయి. ఈ మేరకు ఎస్సై చిర్ర రమేష్ బాబు, తహసీల్దార్ కోడిచింతల రాజు, ఎంపీడీఓ బాలరాజు వాహనదారులను అప్రమత్తం చేస్తున్నారు.

నేడు పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలి

గార్ల: సెప్టెంబర్ 1వ తేదీన నేడు పెన్షన్ విద్రోహ దినంగా పాటించాలని టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ వీరునాయక్ పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో టీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శివనాయక్, హెచ్‌ఎం వీరభద్రం, భోజ్యానాయక్, వీరు, వీరన్న పాల్గొన్నారు.

నేటి ధర్నాను జయప్రదం చేయాలి

బయ్యారం: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ రాష్ట్ర ప్రచార కార్యదర్శి శ్రీకాంత్ నాయక్ పిలుపునిచ్చారు. శనివారం బయ్యారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.


గార్ల: మాట్లాడుతున్న వీరునాయక్

ఈ సమావేశంలో నాయకులు భద్రునాయక్, రవీందర్‌నాయక్, లక్ష్మయ్య, బాలు పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్: ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో నేడు నిర్వహించనున్న పెన్షన్ విద్రోహ దినోత్సవ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొరివి సుధాకరాచారి శనివారం పిలుపునిచ్చారు.

అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలి


అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టుల ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ శాఖ కార్యాలయంలో జిల్లా అధికారి బి. శ్రీనివాస్‌కు నాయకులు శనివారం వినతిపత్రం అందజేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తుందని, విద్యార్థులకు బోధన చేయడానికి ఇంత వరకు ఖాళీలను ఎందుకు భర్తీ చేయలేదన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలుగు శ్రావణ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆబోతు అశోక్, పట్టణ కార్యదర్శి కుమార్ పాల్గొన్నారు.

జిల్లాను హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించాలి

మరిపెడ: జిల్లాను హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు అలువాల వీరయ్య డిమాండ్ చేశారు. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలోని భార్గవి ఫంక్షన్ హాలులో పార్టీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రజారోగ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ సమావేశంలో నాయకులు దుండి వీరన్న, నందిపాటి వెంకన్న, బానాల రాజన్న, గుండగాని మధుసూదన్,


మాట్లాడుతున్న వీరయ్య

శ్రీనివాస్‌రెడ్డి, ఉప్పలయ్య, షరీఫ్, దర్గయ్య, రాజశేఖర్, వెంకన్న, సోమయ్య, నరేష్ తదితరులున్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం


పెద్దవంగర: గంట్లకుంట పాఠశాలలో..

పెద్దవంగర: మండలంలోని గంట్లకుంట ప్రాథమికోన్నత పాఠశాల్లో కొన్నేళ్లగా విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం కన్నా శ్రీనివాస్‌తో పాటు ఉపాధ్యాయులు సత్యం, రాజేష్‌లను విద్యార్థులు, స్థానికులు శనివారం సన్మానించారు. బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు రూ.4వేల విలువ చేసే ప్లేట్లు, గ్లాసులు విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మంజుల, ఉపాధ్యాయులు విజయ, ఉమ, భిక్షపతి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడికి..

డోర్నకల్: మండలంలోని కన్నెగుండ్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందిన సంగయ్యను శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సంకా బద్రినారాయణ, మిరియాల సతీష్, మండల అధ్యక్షుడు వి.సీతారాములు, కార్యదర్శి వినోద్‌కుమార్, ఎంఈఓ పూల్‌చంద్, నోడల్ హెచ్‌ఎం లక్ష్మా, కాంప్లెక్స్ హెచ్‌ఎం రుక్మాంగదరరావు పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరించండి

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్ డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన సీపీఐ వార్డు బాట ప్రజామాట కార్యక్రమంలో భాగంగా శనివారం మున్సిపాలిటీ పరిధిలోని 11 వార్డులను సీపీఐ బృందాలు సందర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, వెలుగు శ్రావణ్, మాలోత్ రవీందర్, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, నాగెల్లి యాకమ్మ, తోట రాజకుమారి, ఎర్రోజు పద్మ, తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనం నిర్మించాలని వినతి

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనం శిథిలావస్థకు చేరుకుందని వెంటనే నూతన భవనానికి నిధులు కేటాయించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని డీఐఈఓ కార్యాయలంలో ఇంటర్ విద్యాశాఖ అధికారి మదార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మధు మాట్లాడుతూ.. జూనియర్ కళాశాల శిథిలావస్థలో ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వర్షాకాలంలో తరగతి గదిలో స్లాబ్ నుంచి నీరు లీకేజీ అవుతుందన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ స్పందించి భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ సూర్యప్రకాష్, నాయకులు చందు, రాకేష్, మగేష్, వికాస్ పాల్గొన్నారు.


డీఐఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

సంక్షిప్త సమాచారం

ర్యాగింగ్ నివారణపై అవగాహన కల్పించాలి

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాల, ర్యాగింగ్ నివారణ చర్యల కోసం ఈనెల 30వరకు అవగాహన కల్పించాలని కాకతీయ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఈసం నారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలను శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, వైఎస్ ప్రిన్సిపాల్ శంకర్, కృష్ణారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించండి

నెహ్రూసెంటర్: జిల్లాలోని చిన్నగూడూరు మండలంలోని జయ్యారం గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు ఆర్టీసీ ఎండీకి శనివారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, విజయ, పద్మ, రాధా పాల్గొన్నారు.

గర్భిణుల నమోదు చేపట్టాలి



మరిపెడ రూరల్: నీలికుర్తి సెక్టార్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో కొత్త గర్భిణుల నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని నీలికుర్తి సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ గొల్లపల్లి రాణి అన్నారు. మండలంలోని నీలికుర్తి సెక్టార్‌లోని మూన్యతండా అంగన్‌వాడీ కేంద్రం టీచర్ కనకమ్మ సమక్షంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు నిబంధనల ప్రకారం నడుచుకోవాలని సూచించారు.

దరఖాస్తుల స్వీకరణ

గూడూరు: మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం రుణమాఫీ కానీ రైతుల దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా ఏఓ అబ్దుల్‌మాలిక్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు మండలంలో మొత్తం 146 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా, వారి పేర్లు అప్‌లోడ్ చేస్తున్నామని తెలిపారు.

విశ్వకర్మసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా జలేంద్రాచారి



బయ్యారం: బీజేపీ అనుబంధ విశ్వకర్మ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బయ్యారానికి చెందిన చేరాల జలేంద్రాచారిని నియమిస్తూ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు పూసల బ్రహ్మచారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

గ్రామాభివృద్ధికి కృషి



మహబూబాబాద్ రూరల్: మాధవాపురం గ్రామాభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. ఆయన స్వగ్రామమైన మహబూబాబాద్ మండలంలోని మాధవాపురానికి శనివారం వచ్చారు. ఈసందర్భంగా ఆయనను గ్రామస్తులు మర్యాద పూర్వకంగా కలిసి సన్మానం చేశారు. కార్యక్రమంలో మద్ది వెంకటరెడ్డి, ఇస్లావత్ వెంకన్ననాయక్, ఇస్లావత్ లచ్చిరాంనాయక్, ఎంగలి రాంరెడ్డి, సుధాకర్ రెడ్డి, అంజయ్య, లింగన్న, చంద్రయ్య ఉన్నారు.

ఆర్థికసాయం

తొర్రూరు: పట్టణానికి చెందిన ఎండీ ఆయుబ్‌కు కొన్ని నెలలుగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. సమాచారం తెలుసుకున్న 2003–04 బ్యాచ్ పదో తరగతి మిత్రులు కలిసి రూ.10,200ల ఆర్థికసాయం ఆయుబ్‌కు అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు కొండ యాకన్న గౌడ్, గాట్ల భరత్, గుంటుక వెంకటేష్, కృష్ణ, శ్రీనివాస్, శంకర్, నాగరాజు పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు..

కేసముద్రం: మండలంలోని సబ్‌స్టేషన్‌తండా జీపీకి చెందిన బానోత్ హున్యా అనే వ్యక్తి శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబం పేదరికంలో ఉండగా, విషయం తెలుసుకున్న బాదావత్ పవన్ అనే వ్యక్తి దహన సంస్కారాలకు రూ.15వేల ఆర్థికసాయం అందజేశాడు.

కేజీబీవీ నూతన భవన నిర్మాణం సందర్శన

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ నూతన భవన నిర్మాణాన్ని ఆర్డీఓ నర్సింగరావు, తహసీల్దార్ మహబూబ్ అలీ, ఏఎంఓ శ్రీరాములు, డీఈఓ రాజేశ్వర్, జీసీడీఓ విజయకుమారి శనివారం సందర్శించారు. కొంత కాలంగా భూవివాద కారణంగా నిలిచిపోయిన నూతన భవన నిర్మాణం తిరిగి కొనసాగించుటకు విచారణ కొసం అధికారులు సందర్శించారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

దంతాలపల్లి: నిస్వార్థ సేవతలతోనే ఉద్యోగులకు గుర్తింపు వస్తుందని తొర్రూరు ఆర్డీఓ నర్సింహారావు అన్నారు. మండలకేంద్రంలో బాలాజీ ఫంక్షన్ హాలులో తహసీల్దార్ శ్రీనివాసరావు పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్‌ను ఘనంగా సన్మానించారు.

ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



డోర్నకల్: వినాయక నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని డోర్నకల్ సీఐ బి.రాజేష్ కోరారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం వినాయక ఉత్సవాలను పురస్కరించుకుని మత పెద్దలతో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాలకు నిర్వాహకులు పోలీస్, విద్యుత్ శాఖల నుంచి అనుమతులు తప్పనిసరిగా పొందాలని కోరారు. అనంతరం మతపెద్దలు సీఐని సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సై వంశీధర్, తదితరులు పాల్గొన్నారు.

బయ్యారం: కులమతాలకు అతీతంగా పండుగలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని గార్ల–బయ్యారం సీఐ రవికుమార్ సూచించారు. ఈ సమావేశంలో ఎస్సైలు తిరుపతి, జీనత్‌కుమార్ పాల్గొన్నారు.

బ్రాహ్మణకుంటను కాపాడాలి

డోర్నకల్: స్థానిక అంబేడ్కర్‌నగర్ శివారులోని బ్రాహ్మణకుంటను కాపాడాలంటూ అంబేడ్కర్‌నగర్ వాసులు మున్సిపల్, రెవెన్యూ అధికారులను కోరారు. వార్డు కౌన్సిలర్ కొండేటి హేమచంద్రశేఖర్ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌నగర్ వాసులు శనివారం మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి, చైర్మన్ వాంకుడోత్ వీరన్న, తహసీల్దార్ కృష్ణవేణికి వినతిపత్రం సమర్పించారు. బ్రాహ్మణకుంటను ప్లాట్లుగా మార్చేందుకు కొంతమంది కుంటను చదును చేస్తున్నారన్నారు.

మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలి

నెల్లికుదురు: మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు, మూత్రశాలలను వాడుకలోకి తీసుకరావాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఇస్సంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు బస్టాండ్‌లోని మరుగుదొడ్ల వద్ద శనివారం నిరసన తెలిపారు.

బస్టాండ్‌లో సౌకర్యాలు కల్పించాలి

కేసముద్రం: మండల కేంద్రంలో గల ఆర్టీసీ బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్, మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం బస్టాండ్‌ను వారు సందర్శించారు.

నేడు, రేపు మహాసభలు

మహబూబాబాద్ రూరల్: భారత కార్మిక సంఘాల సమాఖ్య జాతీయ మహాసభలు నేడు, రేపు పూణేలో జరగనున్నాయని ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు మదార్, నాయకుడు రాంసింగ్ అన్నారు. మహబూబాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బృందం సభ్యులు శనివారం బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో నాయకులు రాంబాబు, దుర్గప్రసాద్, సారయ్య, శ్రీరాములు, స్వరూప, బయమ్మ పాల్గొన్నారు.

మేకల చోరీ

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని ఇస్లావత్ తండా (ఎం) గ్రామంలో రూ.60వేల విలువగల ఆరు మేకలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని బాధితుడు బానోత్ సంతోష్ శనివారం తెలిపాడు. తమ ఇంటి ఆవరణలో గల మేకలను ఇద్దరు యువకులు ఎత్తుకెళ్లే దృశ్యాలు సీసీ కెమెరా ఫుటేజీల్లో రికార్డు అయ్యాయని, వాటి ఆధారంగా కురవి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశానని పేర్కొన్నాడు.

క్లుప్తంగా

ఎమ్మెల్యేకు వినతి



తొర్రూరు: తెలుగు విశ్వవిద్యాలయానికి ఆదికవి పాల్కురి సోమనాథుడి పేరు పెట్టాలని మార్గం ఫౌండేషన్, స్టూడెంట్ ఫర్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, సాయి సందీప్, శ్యాంసుందర్‌రెడ్డి, సోమన్న, యాకయ్య పాల్గొన్నారు.

ఎస్సైగా క్రాంతికిరణ్



పెద్దవంగర: పెద్దవంగర నూతన ఎస్సైగా క్రాంతికిరణ్ శనివారం బాధ్యలు చేపట్టారు. ఇక్కడ విధులు చేపట్టిన ఎస్సై ఉపేందర్ తొర్రూరుకు ఇటీవల బదిలీపై వెళ్లారు.

బ్యాగ్‌ల పంపిణీ



కేసముద్రం: కేసముద్రంవిలేజ్ ప్రాథమిక పాఠశాలలో పూర్వ ఉపాధ్యాయుడు అక్కర బ్రహ్మయ్య జ్ఞాపకార్థం ఆయన కుమార్తె ఉమాదేవి, కుమారుడు నగేష్ శనివారం విద్యార్థులకు రూ.30వేల విలువైన స్కూల్‌బ్యాగ్స్, షూ, టై, బెల్టులు, ఐడీ కార్డులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో నోడల్ హెచ్‌ఎం కొత్త జగన్మోహన్‌రెడ్డి, హెచ్‌ఎం హరినాథ్, గుండు సురేందర్, భాస్కర్ పాల్గొన్నారు.

రూ.75వేల ఆర్థికసాయం



కురవి: సీరోలు మండలం రేకుల తండా జీపీ పరిధిలోని రూప్లతండాకు చెందిన బానోత్ విష్ణునాయక్ కుమార్తె లవీనాబాయ్ ఉన్నత చదువు కోసం కిసాన్ పరివార్ లిమిటెడ్, పద్మజా చారిటబుల్ ట్రస్ట్ అధినేత నునావత్ భూపాల్‌నాయక్ శనివారం రూ.75వేల ఆర్థికసాయంగా చెక్కును అందజేశారు. సాయం అందించిన భూపాల్‌నాయక్‌కు బాలిక తండ్రి విష్ణునాయక్ కృతజ్ఞతలు తెలిపాడు.

యువకుడిపై కేసు నమోదు

గార్ల: గంజాయి తాగుతూ పోలీసులకు పట్టుబడ్డ ఓ యువకుడిపై కేసు నమోదైన సంఘటన శనివారం గార్ల బస్టాండ్ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. గార్ల మండలం పెద్దకిష్టాపురం గ్రామానికి చెందిన బానోత్ కిరణ్ గార్ల ఆర్టీసీ బస్టాండ్‌లో గంజాయి సిగరేట్ తాగుతున్నాడు. బస్టాండ్ సమీపంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులను చూసి పరారయ్యాడు. వెంటనే పోలీసులు అతడిని పట్టుకొని జేబులు తనిఖీ చేయగా 150 గ్రాముల గంజాయి లభ్యం కావడంతో స్టేషన్‌కు తరలించారు. గంజాయి ఎక్కడ కొనుగోలు చేశావని కిరణ్‌ను పోలీసులు విచారించగా, కురవి గ్రామానికి చెందిన రాములు వద్ద రూ.3,750 విలువ గల 150గ్రాముల గంజాయిని కొనుగోలు చేసినట్లు పోలీసులకు తెలిపాడు. ఈమేరకు కిరణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జీనత్‌కుమార్ వెల్లడించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మహబూబాబాద్ రూరల్: చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల పూసపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కన్నెబోయిన కుమార్ (45) ఈనెల 4వ తేదీన గ్రామంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నాడు. ద్విచక్రవాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. కుమార్‌కు తీవ్రగాయాలు కాగా వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య వెంకటమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని మహిళకు గాయాలు

దంతాలపల్లి: ద్విచక్రవాహనం ఢీకొని మహిళకు గాయాలైన సంఘటన మండలంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింహులపేట మండలం చారితండాకు చెందిన జాటోత్ విజయ మండలంలోని బీరిశెట్టిగూడెం గ్రామంలో నడుచుకుంటు వెళ్తుంది. తొర్రూరు మండల కేంద్రానికి చెందిన ధరావత్ అర్జున్ ద్విచక్ర వాహనంతో విజయను ఢీకొట్టాడు. దీంతో విజయ తలకు తీవ్రగాయమైంది. సంఘటన స్థలం చేరుకున్న ఎస్సై పిల్లల రాజు పోలీస్ వాహనంలో తొర్రూరు ఆస్పత్రికి తరలించారు.